# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ బెంగళూరులో ఈరోజు సుమారు 22 వేల 800 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

- ప్రజలందరికీ అత్యంత తక్కువ ఖర్చుతో సత్వర న్యాయం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి సూచించారు.

- భారత ఆర్థికాభి వృద్ధిలో ఇస్రో కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ తెలిపారు.

- భారత త్రివిధ దళాల మధ్య సమన్వయానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనమని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

======================

ప్రజలందరి భాగస్వామ్యంతో 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బెంగళూరులో ఫేజ్ 3 మెట్రో రైల్ ప్రాజెక్టును ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ... సంస్కరణలు, పనితీరు, పరివర్తనల ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. 2014కు ముందు భారతదేశం బలహీనమైన 10 దేశాలలో ఒకటిగా ఉండేదని, ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని పేర్కొన్నారు. మెట్రో రైల్ సేవలు ఐదు నగరాల నుండి 24 నగరాలకు విస్తరించి, మెట్రో నెట్‌వర్క్ పరంగా ప్రపంచంలో మూడవ అతిపెద్ద నెట్‌వర్క్‌గా నిలిచిందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదేవిధంగా ఆపరేషన్ సిందూర్ విజయం రక్షణ రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' సాంకేతికత వల్లే సాధ్యమైందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సరిహద్దు ఆవల ఉన్న ఉగ్రవాదుల స్థావరాలను కూడా ధ్వంసం చేయగల సామర్థ్యం నేడు

భారత్ కు ఉందని రుజువైందన్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చిన పాకిస్తాన్‌ను గంటల వ్యవధిలోనే మోకరిల్లేలా చేశామని పేర్కొంటూ...

(వాయిస్ 18 సెకన్లు)

అంతకుముందు, ప్రధానమంత్రి బెంగళూరులో సుమారు 22 వేల 800 కోట్ల రూపాయల విలువైన మెట్రో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే బెంగళూరు-బెళగావి మధ్య వందే భారత్ రైలును కూడా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభల ప్రధాన లక్ష్యమని సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయి పేర్కొన్నారు. ఈ మూడు వ్యవస్థల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఆయన తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్ లోని నహర్‌లగున్‌లో నూతనంగా నిర్మించిన గౌహాటి (Guwahati) హైకోర్టు ఇటానగర్ శాశ్వత బెంచ్ భవనాన్ని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్యంత తక్కువ ఖర్చుతో సత్వర న్యాయం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గత 75 సంవత్సరాల్లో అనేక సంక్షోభాలను ఎదుర్కొన్నప్పటికీ, భారతదేశం బలంగా, ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందిన దేశంగా పురోగమిస్తోందని జస్టిస్ బి.ఆర్.గవాయి వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత త్రివిధ దళాల మధ్య సమన్వయానికి `ఆపరేషన్ సిందూర్` నిదర్శనమని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాయుధ బలగాల ఏకీకరణ ఆవశ్యకతను ఈ సందర్భంగా ప్రస్తావించారు. త్రివిధ దళాల ఉమ్మడి కార్యకలాపాల భవిష్యత్ కార్యాచరణను రూపొందించడానికి ముఖ్యమైన అంశాలను సీనియర్ అధికారులకు వివరించారు. నేటి ఆధునిక యుద్ధంలో సాంకేతికత కారణంగా వస్తున్న పెను మార్పులను ఎదుర్కోవడానికి సమగ్ర అభివృద్ధి, ఆత్మనిర్భరత, సైన్యంలో అనుసరిస్తున్న మార్పులపై లోతైన అవగాహన ఉండటం ఎంతో ముఖ్యమని అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్‌లో 1,800 కోట్ల రూపాయల వ్యయంతో బీఈఎంఎల్ (BEML) రైల్ హబ్ నిర్మాణ ప్రాజెక్టుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు శంకుస్థాపన చేశారు. వందే భారత్, అమృత్ భారత్ మెట్రో రైళ్లకు సంబంధించిన కోచ్‌లను ఇక్కడ తయారు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. భారత సంప్రదాయంలో సృష్టికర్త అయిన 'బ్రహ్మ' పేరు మీద ఈ యూనిట్‌కు పేరు పెట్టారని అన్నారు. ఇక్కడ తయారైన కోచ్‌లతో భారతదేశంలోని హై-స్పీడ్ రైళ్లు నడుస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 5 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని వెల్లడిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒకటని, ఈ విజయంలో ఇస్రో ముఖ్యపాత్ర పోషిస్తోందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. తిరువనంతపురంలోని వలియమలలో ఈ రోజు జరిగిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (IIST) 13వ స్నాతకోత్సవంలో వీడియో సందేశం

ద్వారా ఆయన ప్రసంగించారు. భారత అంతరిక్ష రంగానికి అత్యుత్తమ ప్రతిభావంతులను అందించడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం 'ఫిట్ ఇండియా' ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు దోహదపడిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 'సండేస్ ఆన్ సైకిల్ - ఫిట్ ఇండియా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 50 వేలకు పైగా గ్రామ పంచాయతీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినదనీయమన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమం నేడు గ్రామాలకు కూడా చేరిందని మన్సుఖ్ మాండవీయ వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సుమారు 30 లక్షల మంది రైతులకు 3 వేల 200 కోట్ల రూపాయలకు పైగా పంటల బీమా క్లెయిమ్స్‌ను రేపు రాజస్థాన్‌లోని ఝున్ ఝునూలో పంపిణీ చేయనున్నారు. ఈ క్లెయిమ్స్ చెల్లింపులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (DBT) పద్ధతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని బాబా ఖడక్ సింగ్ మార్గ్‌లో పార్లమెంట్ సభ్యుల కోసం కొత్తగా నిర్మించిన 184 టైప్-VII బహుళ అంతస్తుల గృహ సముదాయాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నివాస ప్రాంగణంలో సింధూర్ మొక్కను ప్రధానమంత్రి నాటనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు. ఒక్కో నివాస గృహం దాదాపు 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని, నివాసానికి, అధికారిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా వుంటుందని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే వారం రోజుల పాటు పశ్చిమ బెంగాల్, అస్సాం, సిక్కిం, బిహార్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అలాగే, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో కూడా రాబోయే ఏడు రోజుల పాటు అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఇక ఈ రోజు దేశంలోని ఉత్తర, మధ్య ప్రాంతాలైన హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ మధ్య ప్రదేశ్‌లలో భారీ వర్షాలు కురిసాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =